నిరుద్యోగులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ

ముషీరాబాద్: స్వాంతన చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిరుద్యోగులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ అందించి ఉద్యోగ అవకాశాలను కల్పిస్తున్నామని సంస్థ ప్రతినిధులు తెలిపారు. 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ చదివి 18–30 సంవత్సరాల వయస్సు నిరుద్యోగులకు రెండు నెలల పాటు కంప్యూటర్, టైపింగ్, స్పోకెన్ ఇంగ్లిష్, ఇంటర్వ్యూ స్కిల్స్ ఉచితంగా నేర్పించి వారి చదువుకు తగిన అవకాశాలను కల్పిస్తామని తెలిపారు. పార్సిగుట్ట సమీపంలోని 44 నంబర్ బస్టాప్ వద్ద ఉన్న ఎంసీహెచ్‌కాలనీ కమ్యూనిటీ హాల్‌లో తమ కేంద్రానికి వచ్చి దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు ఫోన్ నం.86889 14603లో సంప్రదించాలని కోరారు.

టీబీ ముక్త్ భారత్

ముషీరాబాద్: టీబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలోని రెయిన్‌బో హోం అనాథాశ్రమంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌బీఎస్‌కే వైద్యులు పూర్ణిమా, హాసిని విద్యార్థినులకు వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి ఏఎస్‌ఎం విజయకుమారి, నిర్వాహకులు విజయ్‌కుమార్, శ్రీధర్, సైదులు, రజిత తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులను పూర్తి చేయించాలని వినతి

ముషీరాబాద్: ముషీరాబాద్ డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న డ్రైనేజీ, మంచినీటి పైపులైన్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని బీఆర్‌ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ కోరారు. మంగళవారం ముషీరాబాద్ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డితో కలిసి చిలకలగూడ రిజర్వాయర్ డీజీఎం మోహన్‌రాజ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీధర్‌రెడ్డి, జావిద్‌ఖాన్, జాఫర్, సర్వర్, మున్వర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై స్పెషల్ డ్రైవ్

అంబర్‌పేట: వర్షకాలంలో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరముందని బాగ్‌అంబర్‌పేట కార్పొరేటర్ బీ.పద్మావెంకట్‌రెడ్డి అన్నారు. మంగళవారం డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో జీహెచ్‌ఎంసీ పారిశుద్ధ్యం విభాగం సిబ్బంది నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్‌ను ఆమె పరిశీలించారు. కేవలం చెత్తాచెదారం కాకుండా జనావాసాల్లో మట్టికుప్పలు, పిచ్చి మొక్కల తొలగింపు వంటి చర్యలు తీసుకోవాలన్నారు. వర్షకాలం ముగిసే వరకు మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణ ఉండాలన్నారు.

పైడి లక్ష్మయ్య, సంజీవరెడ్డి నేటి తరానికి ఆదర్శమూర్తులు

చిక్కడపల్లి: పాలనారంగంలో దక్షతతో వ్యవహరించి ప్రజాశ్రేయస్సుకు పాటుపడిన పైడి లక్ష్మయ్య, వారి కుమారుడు సంజీవరెడ్డి నేటితరాలకు ఆదర్శమూర్తులని వక్తలు పేర్కొన్నారు. రసమయి, డాక్టర్ పైడి లక్ష్మయ్య ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం త్యాగరాయ గానసభలో 'పైడి లక్ష్మయ్య పైడి సంజీవరెడ్డిల పేరిట పురస్కారాలు ప్రదానోత్సవం జరిగింది. కేంద్రహోంశాఖ పూర్వ కార్యదర్శి పద్మనాభయ్య ముఖ్యఅతిథిగా పాల్గొని పూర్వ కేంద్ర విజిలెన్స్ కమిషనర్ కేవీ చౌదరి, వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకటరామరాజు, ప్రముఖ సంగీత విద్వాంసులు నామా చంద్రబాబునాయుడు, ప్రముఖ రచయిత్రి డాక్టర్ శరత్ జ్యోత్స్నరాణికి పురస్కారం ప్రదానం చేశారు.

తరగతి గదుల్లో విద్యార్థుల సంఖ్యను తగ్గించండి

ముషీరాబాద్: నియమ నిబంధనలకు విరుద్ధంగా ఒక్కో తరగతి గదిలో 60 నుంచి 65 మంది విద్యార్థులను ఉంచి చదివిస్తున్నారని దీనిపై ఇంటర్ బోర్డు దృష్టి సారించాలని సోషల్ వర్కర్ జి.శ్రీనునాయుడు అన్నారు. మంగళవారం ఇంటర్ బోర్డు కార్యదర్శిని కలిసి వినతిపత్రం అందజేశారు. దీనిని పరిగణలోకి తీసుకుని తరగతి గదిలో తక్కువ విద్యార్థులు ఉండే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

మారుతున్న కాలానికి అనుగుణంగా బోధన ఉండాలి

ముషీరాబాద్: మారుతున్న కాలానికి అనుగుణంగా ఉపాధ్యాయులు విద్యాబోధన అందించాలని డిప్యూటీ డీఈఓ శ్రావణ్‌కుమార్ అన్నారు. ముషీరాబాద్ విద్యామండలి పరిధిలో ప్రభుత్వ పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుడు నాగయ్య పీహెచ్‌డీ పూర్తి చేశారు. డాక్టరేట్ పొందిన సందర్భంగా మంగళవారం ఆయనను ముషీరాబాద్ పాఠశాల ప్రాంగణంలో సన్మానించారు.

గంజాయి విక్రయిస్తున్న యువకుడి అరెస్టు

650 గ్రాముల గంజాయి స్వాధీనం

చిక్కడపల్లి: గంజాయి తాగడంతో పాటు, విక్రయిస్తున్న యువకుడిని చిక్కడపల్లి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అతని వద్ద నుంచి 650 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ రాజునాయక్ తెలిపిన వివరాల ప్రకారం... బిహార్‌కు చెందిన రంజిత్‌కుమార్(అలియాస్ చోటు) (21) చిక్కడపల్లిలోని అన్నపూర్ణ బాయస్ హాస్టల్‌లో సహాయకుడిగా పనిచేస్తున్నారు. బిహార్ నుంచి అక్రమంగా గంజాయిని తీసుకువచ్చి విక్రయిస్తున్నాడు. 6 నెలలుగా గుట్టుచప్పుడు కాకుండా గంజాయి దందా కొనసాగిస్తున్నట్లు విచారణలో తెలిసింది. సమాచారం రంజిత్‌కుమార్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

వానాకాలం..

- ఈ ఏడాది ఫీవర్‌లో 111 డెంగీ, 100కి పైగా టైఫాయిడ్ కేసులు
- కలుషిత నీరు తాగొద్దని సూచిస్తున్న వైద్యులు
- దోమల నివారణతో డెంగీ, మలేరియా దూరం

అప్రమత్తతే శ్రీరామ రక్ష

నల్లకుంట: తొలకరి వర్షాలు కురుస్తున్నాయి. మురికి వాడలు, పట్టణాల్లోని పల్లపు ప్రదేశాలు, గుంతల్లో నీరు చేరుతోంది. దోమలు వృద్ధి చెందుతున్నాయి. తాగునీరు కలుషితమవుతోంది. దీంతో సీజనల్ వ్యాధులైన డెంగీ, మలేరియా, టైఫాయిడ్ కేసులు విజృంభిస్తున్నాయి. సాధారణ జ్వరాలు అక్కడక్కడ పెరుగుతున్నాయి. ప్రజలు సీజనల్ వ్యాధులపై అవగాహన పెంచుకుని తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

◆ సీజనల్ వ్యాధుల సీజన్ మొదలు కావడంతో నల్లకుంట ఫీవర్ ఆస్పత్రిలో జ్వరాల కేసులు ఇప్పుడిప్పుడే పెరుగుతున్నాయి. అలాగే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనూ ఇదే పరిస్థితి ఉంది. ప్రధానంగా అంబర్‌పేట నియోజకవర్గంలోని మూసీ, హుస్సేన్ సాగర్ నాలా పరీవాహక ప్రాంతాలలో రోగుల సంఖ్య పెరుగుతోంది. ఈ ఏడాది జనవరి నుంచి జూన్ 15వ తేదీ వరకు ఫీవర్ ఆస్పత్రిలో డయేరియా 1,034, డెంగీ 111, టైఫాయిడ్ 93, 1,047 వైరల్ ఫీవర్ కేసులు నమోదయ్యాయి అంటే పరిస్థితి ఎలా ఎందో అర్థం చేసుకోవచ్చు.

కారణాలివే...

◆ సీజనల్ వ్యాధులకు అనేక కారణాలున్నాయి. దోమ కుట్టినప్పుడు వాటి లాలా జలంలో ఉన్న సూక్ష్మ జీవులు మనిషి రక్తంలోకి ప్రవేశించి జబ్బులు కలుగజేస్తాయి.దోమల వల్ల ప్రధానంగా డెంగీ,చికూన్‌గన్యా,మలేరియా,మొదడు వాపు, బోధకాలు వస్తాయి. అలాగే తాగునీరు, ఆహారం కలుషితం కావడం వల్ల టైఫాయిడ్, విరేచనాలు, కామెర్ల బారిన పడుతారు. నీటితో పాటు ఆహారం కలుషితం కావడం వల్ల వచ్చే ప్రధానమైన జబ్బు అతిసారా (నీళ్ల విరేచనాలు). ఒక్కో దఫా వాంతులు ఎక్కువగా అవుతాయి. ఫలితంగా శరీరంలోని నీరు పోయి మనిషి నీరసించిపోతాడు. ప్రాణాల మీదకు వస్తుంది. విరేచనాలకు గురైతే తక్షణమే ఎలక్ట్రాల్ పౌడర్ కలిపిన నీరు తాగాలి. మజ్జిగ, కొబ్బరి నీళ్లు తీసుకుంటే మంచిది. సమీపంలోని ఆరోగ్య కేంద్రానికి వెళ్లాలి.

ఈ ఏడాది నల్లకుంట ఫీవర్ ఆస్పత్రిలో నమోదైన వ్యాధుల వివరాలు

నెల	డయేరియా	డెంగీ	వైరల్ ఫీవర్	టైఫాయిడ్
జనవరి	104	20	161	15
ఫిబ్రవరి	129	19	147	18
మార్చి	227	20	183	08
ఏప్రిల్	211	15	198	11
మే	248	24	243	41
జూన్	115	13	115	సమాచారం లేదు



ఫీవర్ ఆస్పత్రిలో వైద్యం పొందేందుకు వచ్చిన జ్వర పీడితులు

వ్యాధుల కాలం

సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్త



వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉంటుంది. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటించడంతో పాటు కలుషిత నీరు తాగకుండా ఉండటం ద్వారా వ్యాధులు సోకకుండా రక్షణ పొందవచ్చు. జ్వరం, ఇతర అనారోగ్య సమస్యలు వస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి. ప్రభుత్వ ఆస్పత్రులు, బస్తీ దవాఖానలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు, అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయి.

–సీఎస్ ఆర్ఎంఓ డా.జయలక్ష్మి, ఫీవర్ ఆస్పత్రి

దోమల నివారణకు చర్యలు

సీజనల్ వ్యాధులు ఎక్కువగా దోమల వల్ల వస్తాయి. ప్రజలు దోమలు కుట్టకుండా చూసుకోవాలి. తమ నివాస పరిసరాల్లో నీటి గుంతలు లేకుండా చేసుకోవాలి. ఒకవేళ ఉన్నా వాటిల్లో ఆయిల్ బాల్స్ వేయాలి. ఇంటి పరిసరాల్లో పాత టైర్లు, కొబ్బరి బొండాలు, రుబ్బురోళ్లు తదితర వాటిలో కొంచెం నీరున్నా దోమలు గుడ్లు పెడతాయి. అందువల్ల అలాంటి వాటిని లేకుండా చూసుకోవాలి. ఫ్రైడేను డ్రై డేగా పాటించి వారానికి ఒక దఫా ప్రజలు తమ నీటి తొట్టిలు, క్యాన్లను శుభ్రం చేసుకుని ఎండబెట్టాలి.

– జి. భానుప్రకాష్, ఫీవర్ సబ్ యూనిట్ అధికారి

యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశాం



జిల్లాలో ఇంకా సీజనల్ వ్యాధులు ప్రబలలేదు. ఇవి వ్యాప్తి చెందకుండా ముందస్తు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశాం. ఇందులో భాగంగా జీహెచ్‌ఎంసీ సర్కిల్–16 పరిధిలో వర్షాకాలం ముందస్తు మాన్సూన్ శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాలు చేపట్టాం. బస్తీ దవాఖానల్లో వైద్యులను అప్రమత్తం చేశాం. అనుమానాస్పదంగా ఉన్న జ్వర పీడితులకు డెంగీ, మలేరియా లాంటి పరీక్షలు చేయాలని ఆదేశాలు జారీ చేశాం. జ్వరం, వాంతులు, విరేచనాలు, కామెర్లకు స్వంత వైద్యం చేసుకోకుండా సమీప ప్రభుత్వాసుపత్రిలో డాక్టర్లను సంప్రదించాలి.

– డా.హేమలత, ఏఎంహెచ్ఓ

న్యూ డెమాక్రసీ మద్దతు కోరిన ఎమ్మెల్సీ కవిత



విద్యానగర్‌లోని న్యూ డెమాక్రసీ నేతలను మద్దతు కోరి లేఖను అందిస్తున్న ఎమ్మెల్సీ కవిత

ముషీరాబాద్: బీసీలకు విద్య, ఉద్యోగ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బీసీ బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం తెలపాలని డిమాండ్ చేస్తూ జూలై 17వ తేదీన తలపెట్టిన రైల్ రోకోకు సంపూర్ణ మద్దతు ఇవ్వాలని విద్యానగర్‌లోని సీపీఐ ఎంఎల్ న్యూ డెమాక్రసీ మద్దతును ఎమ్మెల్సీ కవిత కోరారు. మంగళవారం విద్యానగర్‌లోని ఆ పార్టీ కార్యాలయానికి చేరుకుని పార్టీ నేతలు ఎస్.వెంకటేశ్వర్‌రావు, కె.గోవర్ధన్, జేవీ చలపతిరావు, రణధీర్‌లతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ జాగృతి, యూపీఎఫ్‌లతో కూడిన రెండు లేఖలను పార్టీ నేతలకు అందజేశారు. న్యూ డెమాక్రసీ నేతలు మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ కవిత తమను కోరిన అంశం న్యాయబద్ధమైనదని అన్నారు. పార్టీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

ఫిర్యాదులు లేకుండా శానిటేషన్ డ్రైవ్ పూర్తి చేయాలి

చిక్కడపల్లి: వర్షాకాలం దృష్ట్యా రోడ్లు, కాలనీలు, బస్తీల్లో పేరుకుపోయిన మట్టికుప్పలు, చెత్తచెదారం తొలగించేందుకు జీహెచ్‌ఎంసీ స్పెషల్ డ్రైవ్‌ను చేపట్టిందని గాంధీనగర్ కార్పొరేటర్ పావని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని చిక్కడపల్లి పీపుల్స్‌పార్క్ వద్ద ఆమె డీఎంసీ రామానుజులరెడ్డి, ఏఎంహెచ్ఓ డా. ప్రవీణతో కలసి మంగళవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఈ డ్రైవ్ 3 రోజుల పాటు డివిజన్ వ్యాప్తంగా కొనసాగుతుందని తెలిపారు. ఎక్కడ ఫిర్యాదులు లేకుండా శానిటేషన్ డ్రైవ్ పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. అదే విధంగా జవహర్‌నగర్ కమ్యూనిటీహాల్ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికులకు కిట్లను అందజేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు వినయ్‌కుమార్, రత్నసాయిచంద్, శ్రీకాంత్, దామోదర్, నర్సింగ్‌రావు, ఆకుల సురేందర్, మున్సిపల్ ఎస్‌ఎఫ్‌ఏలు రాజ్‌కుమార్, సోమేష్, శివకుమార్, గోపాలకృష్ణ, ఆనంద్, సిబ్బంది పాల్గొన్నారు.



మాన్సూన్ డ్రైవ్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్, అధికారులు

బంగారు ఆభరణాల చోరీపై జీరో ఎఫ్‌ఐఆర్

కాచిగూడ: బంగారు ఆభరణాల చోరీపై కాచిగూడ రైల్వే పోలీసులు జీరో ఎఫ్‌ఐఆర్‌ను నమోదు చేశారు. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... చార్మినార్ ప్రాంతానికి చెందిన సయ్యద్ ఇసాముద్దీన్ (45) ఈనెల 16వ తేదీన గుజరాత్‌లోని వడోదర నుంచి కాచిగూడకు రైలులో వచ్చాడు. అక్కడి నుంచి హుస్సేనీఆలంలోని ఇంటికి చేరుకున్నారు. 17వ తేదీన బ్రీఫ్‌కేస్ చూసుకునే సరికి తాళం తీసి ఉంది. అందులో 54 గ్రాముల బంగారు ఆభరణాలు కనిపించలేదు. దీంతో మంగళవారం బాధితుడు కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు జీరో ఎఫ్‌ఐఆర్ నమోదు చేసి కేసును హుస్సేనీ ఆలం పీఎస్‌కు బదిలీ చేశారు.

'గోపాల మిత్రుల' సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం

పశు సంవర్ధకశాఖ మంత్రి శ్రీహరిముదిరాజ్



మంత్రిని కలిసి వినతి పత్రం సమర్పిస్తున్న గోపాల మిత్రుల సంఘం నాయకులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: గోపాల మిత్రుల సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానని పశుసంవర్ధక శాఖ మంత్రి వాకటి శ్రీహరి ముదిరాజ్ హామీ ఇచ్చారు. మంగళవారం తెలంగాణ రాష్ట్ర గోపాల మిత్రుల సంఘం ప్రతినిధులు మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి తమ సమస్యలను వివరించి వినతి పత్రం అందజేశారు. రాష్ట్ర పశుఘనాభివృద్ధి సంస్థ ద్వారా నియమితులైన గోపాల మిత్రులు రైతు ఇంటి ముంగిట పశు కృత్రిమ గర్భధారణ కార్యక్రమంలో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం అగ్రగామిగా ఉందన్నారు. 9 నెలల వేతన బకాయిలను విడుదల చేయాలన్నారు. పశు సంవర్ధక శాఖలో శాశ్వత ఉద్యోగులుగా నియమించాలని కోరారు. ప్రతి నెల జీతాలు విడుదలయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఆరోగ్య, ప్రమాద బీమా కల్పించాలని వారు మంత్రిని కోరారు. దీనికి స్పందించిన మంత్రి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చినట్టు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య మిత్రుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రవీందర్ ముదిరాజ్, తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, పంచ మహేష్‌గౌడ్, తిరుమల రాజేశం, కొప్పెర నాగయ్య, దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి

కాచిగూడ: స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ డిమాండ్ చేశారు. సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ అధ్యక్షతన మంగళవారం కాచిగూడలోని అభినందన్ గ్రాండ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలకు న్యాయం చేయాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే అన్యాయం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీల హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిరక్షించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ఈడబ్ల్యూఎస్, తమిళనాడు రాష్ట్రం తరహాలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 340, 341, 342 ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చిన విధంగా బీసీలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. ఇది ఎవరో వేసే భిక్ష కాదని, 54 శాతం ఉన్న బీసీల హక్కు అని స్పష్టం చేశారు. కోర్టుల్లో 50 శాతం పరిమితిని సాకుగా చూపి బీసీ రిజర్వేషన్లను అమలు చేయకుండా అడ్డుకునే కుట్రలు, కుతంత్రాలను బీసీలు ఐక్యంగా తిప్పికొడతారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నేతలు కోల జనార్దన్, తంగెళ్ల మూడి నందగోపాల్, ఉదయ్ నేత, శివమ్మ, శ్రీనివాస్‌యాదవ్, వెంకటస్వామి, లక్ష్మణ్ పాల్గొన్నారు.



కాచిగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న ఎర్ర సత్యనారాయణ, గుజ్జ కృష్ణ

అగ్ని ప్రమాదం



అంబర్‌పేట: జ్యూవెల్లరీ బాక్సులు భద్రపరిచే గోదాంలో అగ్నిప్రమాదం జరిగింది. ఈ సంఘటన సోమవారం అర్ధరాత్రి అంబర్‌పేట పోలీసు స్టేషన్ పరిధిలోని చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... కాచిగూడలో నివసించే రాజేషా బాగ్‌అంబర్‌పేట నందనవనం కాలనీలోని ఓ భవనంలో బంగారు ఆభరణాలు భద్రపరిచేందుకు వినియోగించే డబ్బాల గోదాంను నిర్వహిస్తున్నాడు. ఈ గోదంలో ఇద్దరు సిబ్బంది సైతం బస చేస్తారు. అర్ధరాత్రి ఒక్కసారిగా మంటలు రావడంతో సిబ్బంది అప్రమత్తమై యాజమానికి సమాచారం ఇవ్వడంతో అతను పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించి మంటలార్పించేశారు. సంఘటన స్థలానికి ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్, కార్పొరేటర్ బీ.పద్మావెంకట్‌రెడ్డి విచ్చేసి పరిశీలించారు. ప్రమాదానికి విద్యుత్ షాక్ సర్క్యూట్ కారణమని భావిస్తున్నట్లు పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

పనిచేసే ఇంటికే కన్నం వేసిన దంపతులు

రిమాండ్‌కు తరలించిన పోలీసులు

చిక్కడపల్లి: పనిచేసే ఇంటికే కన్నం వేసిన భార్యాభర్తలను చిక్కడపల్లి పోలీసులు అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. వారి వద్ద నుంచి 6 తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. చిక్కడపల్లి డీఐ శంకర్ మాలోతు తెలిపిన వివరాల ప్రకారం... అశోక్‌నగర్‌లోని పూజ రైజింగ్ లెరిక్ అపార్ట్‌మెంట్‌లో నేహా జైన్ ఇంట్లో ఏడాదిగా వేముల శ్రీవాణి(30), చంద్రకాంత్(35) దంపతులు పనిచేస్తున్నారు. కాగా వారు నేహాజైన్ ఇంట్లో నుంచి బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. పోలీసుల విచారణ అనంతరం శ్రీవాణి దంపతులను చోరీ చేసినట్లు తేలడంతో వారిని అదుపులోకి తీసుకున్నారు. అయితే నేహాజైన్ 16 తులాలు బంగారు ఆభరాణాలు పోయాయని ఫిర్యాదులో పేర్కొందని తెలిపారు. ఒక డైమండ్ రింగ్ దొరికిందని దాని విలువ రూ.40వేలు ఉంటుందని తెలిపారు. ఇంట్లో పని కుదుర్చుకునే ముందు వారి వివరాలను పూర్తిగా తెలుసుకోవాలని డీఐ శంకర్‌మాలోతు ప్రజలకు సూచించారు.

ఆకట్టుకున్న సంగీత విభావరి

చిక్కడపల్లి: విశ్వసాహితీ, అఖిల భారతీయ భాషా సాహిత్య సమ్మేళన్ సంస్థల ఆధ్వర్యంలో సంగీత విభావరిని సోమవారం గాంధీనగర్ డివిజన్ వెల్ఫేర్ సెంటర్‌లో నిర్వహించారు. గొళ్ళమూడి పద్మావతి పర్యవేక్షణలో బాలికల బృందం పాటలు పాడి ఆకట్టుకున్నారు. అనంతరం కవి సమ్మేళనంలో తంగిరాల చక్రవర్తి, గజవెల్లి దశరథ రామయ్య తదితరులు కవితలు వినిపించి అలరించారు. ప్రముఖ రచయిత్రి బోయి భీమన్న ట్రస్ట్ అధ్యక్షురాలు హైమవతి భీమన్న ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విశ్వసాహితీ సంస్థ వ్యవస్థాపకులు డా. పోతుకూచి సాంబశివరావు కవులకు వేదికగా ఉండేలా తీర్చిదిద్దారని అన్నారు. రచయితల మహాసభలను అద్భుతంగా నిర్వహించారని కొనియాడారు.

'రైల్ రోకో'కు సంపూర్ణ మద్దతు

కాచిగూడ: 42శాతం బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించడానికి తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చేపట్టబోయే ఆందోళనలకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర మున్నూరుకాపు మహాసభ మహిళా అధ్యక్షురాలు చామకూర సుజాత తెలిపారు. మంగళవారం కాచిగూడలోని మున్నూరుకాపు మహాసభ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ.. జూలై 17న బీసీ రిజర్వేషన్ల పెంపు కోసం చేపట్టబోయే రైల్ రోకో కార్యక్రమానికి సంపూర్ణ మద్దతు తెలియజేశారు.

రిజర్వేషన్ ప్రకటించాకే ఎన్నికలు నిర్వహించాలి



చిక్కడపల్లిలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బాలరాజ్‌గౌడ్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను రాజ్యాంగబద్ధంగా ప్రకటించిన తరువాతనే ఎన్నికలకు వెళ్లాలని బీసీ కుల సంఘాల జేఏసీ కన్వీనర్, గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగౌని బాలరాజ్‌గౌడ్, రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్నగౌడ్, బీసీ సమైక్య రాష్ట్ర అధ్యక్షులు సుగూరి దుర్గయ్యగౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం చిక్కడపల్లిలోని సమన్వయ కమిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ... కాంగ్రెస్ ఇప్పుడే ఎన్నికలకు అంత తొందర అవసరం లేదన్నారు. ప్రభుత్వం చేసిన సమగ్ర సర్వేకు ప్రయోజనం లేకుండాపోతోందన్నారు. రాహుల్ గాంధీ ఆశయాలకు అనుగుణంగా ఎన్నికలు చేపట్టాలని గొప్పలు చేప్పే ఈ ప్రభుత్వం బీసీల గురించి ఆలోచించాలన్నారు. మంత్రులు పొంతన లేని ప్రకటనలు చేస్తూ బీసీలను గందరగోళానికి గురి చేస్తున్నారని అన్నారు.

తమిళనాడు తరహాలో బీసీ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలి..

ఏనాడు బీసీల ఊసు ఎత్తని ఎమ్మెల్సీ కవిత నేడు బీసీల పట్ల కపట ప్రేమను చూపిస్తోందని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి తక్షణమే అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకుపోయి బీసీ బిల్లు ఆమోదమయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తమిళనాడు తరహాలో తెలంగాణలో కూడా బీసీ బిల్లును 9వ షెడ్యూల్డ్‌లో పెట్టి బిల్లుకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ జనశక్తి అధ్యక్షుడు బైరు శేఖర్, బీసీ సంఘం నాయకులు బడే సాబ్, బీసీ జన సైన్యం నాయకులు సింగం నాగేశ్వర్‌గౌడ్, గౌడ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బాలగౌని వెంకటేష్‌గౌడ్, గౌడ సంఘం ఉపాధ్యక్షులు ఐలన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల్లో వికలాంగులకు రిజర్వేషన్ కల్పించాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వల్లభనేని ప్రసాద్ తదితరులు

సుందర య్య విజ్ఞాన కేంద్రం: స్థానిక సంస్థల ఎన్నికల్లో వికలాంగులకు రిజర్వేషన్ కల్పించాలని డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్ ద డెఫ్ అధ్యక్షుడు వల్లభనేని ప్రసాద్, ఉపాధ్యక్షుడు కాటమోని వెంకటేష్‌గౌడ్ డిమాండ్ చేశారు. బాగ్‌లింగంపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. వికలాంగులకు రిజర్వేషన్ ప్రకటించిన తరువాతనే ఎన్నికలను నిర్వహించాలన్నారు. ఛత్తీస్‌ఘడ్, రాజస్థాన్, తమిళనాడు రాష్ట్రాలలో వికలాంగులకు రిజర్వేషన ప్రకటించినట్లుగానే ఇక్కడ కూడా ప్రకటించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో వికలాంగులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలన్నారు.

జగదాంబకు ప్రథమ ఘటం ఇక్కడి నుంచే..

నల్లకుంట: ఆషాఢమాసం బోనాల పండుగ ఉత్సవాలను పురస్కరించుకొని పోతరాజు రాబిన్ ఆధ్వర్యంలో మంగళవారం నల్లకుంటలో ఏర్పాటు చేసిన ఘటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏటా ఆషాఢమాసంలో గోల్కొండ జగదాంబ అమ్మవారికి రాబిన్ ప్రతిష్ఠించి పూజించిన ఘటాన్ని ప్రథమంగా సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్ అమృత ప్రత్యేక పూజల్లో పాల్గొని అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. పూజల్లో సికింద్రాబాద్ మహంకాళి దేవాలయం పోతరాజు పుట్ట దేవరాజ్, గోల్కొండ ఓరుగంటి ఎల్లమ్మ తల్లి తొలి నజర్ బోనం పోతరాజు తల్వార్ శివ, భరత్‌స్వామి, రాంనగర్ అఖిల్, వివేక్, కవిత తదితరులు పాల్గొన్నారు.



యూపీహెచ్‌సీలలో వైద్య సౌకర్యాలు మెరుగుపరచాలి

ముషీరాబాద్: గ్రేటర్ హైదరాబాద్ జిల్లా పరిధిలో గల మొత్తం 93 అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లు(యూపీహెచ్‌సీ)లు ఉన్నాయని.. ఇక్కడకు నిత్యం అనేక మంది గర్భిణులు వైద్య పరీక్షల కోసం వస్తుంటారని ఐద్వా గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ అధ్యక్ష, కార్యదర్శులు పద్మ, వరలక్ష్మి, సహాయ కార్యదర్శి నాగలక్ష్మి అన్నారు. ఈ సెంటర్లల్లో వైద్య సౌకర్యాలను మెరుగుపరచాలని మంగళవారం కలెక్టర్ హరిచందనకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలో ప్రైమరీ హెల్త్ సెంటర్లు 24 గంటలు పని చేస్తూ కొన్ని ప్రైమరీ హెల్త్ సెంటర్లల్లో గర్భిణులకు ప్రసవించే సౌకర్యాలు కూడా ఉండేవని తెలిపారు. కానీ చాలా సెంటర్లల్లో ప్రసవాలు చేయడం ఆపేశారని అన్నారు. నగరంలో 14 అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లు 24 గంటలు పని చేస్తున్నాయని అన్నారు. కానీ పాన్‌బజార్, రాణిగంజ్, పురానాపూర్ వంటి సెంటర్లల్లో మాత్రమే ప్రసవాలు జరుగుతున్నాయని తెలిపారు. గగన్‌మహల్, దోమలగూడలో ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్లల్లో లేబర్ రూమ్, ప్రసవ గది, నలుగురు స్టాఫ్ నర్సులు, డాక్టర్లు, ఏఎన్‌ఎం సిబ్బంది ఉన్నప్పటికీ అక్కడ ప్రసవాలను చేయడం లేదని ఆరోపించారు. నగరంలోని అన్ని యూపీహెచ్‌సీలలో సౌకర్యాలు మెరుగుపరచాలని కలెక్టర్‌ను కోరారు. అదే విధంగా సిబ్బంది కొరత లేకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు.

సాహితీ కార్యక్రమాలు విరివిగా జరగాలి

చిక్కడపల్లి: సాహితీ కిరణం, సాహితీ సంస్థ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం త్యాగరాయ గానసభలో వార్షికోత్సవ పురస్కారాల ప్రదానోత్సవ సభ జరిగింది. ఈ సందర్భంగా పింగలి జగన్నాథరావు సాహిత్య పురస్కారాన్ని ప్రముఖ రచయిత వీవీ సత్యప్రసాద్‌కు అదేవిధంగా సిరిగాద బాలమ్మ సాహిత్య పురస్కారాన్ని రచయిత్రి శిష్టా మాధవికి, గట్టుపల్లి చెంచురామారావు సాహిత్య పురస్కారాన్ని రఘుశ్రీ పక్షాన బండారు రామచంద్రరావుకు ప్రదానం చేసి సత్కరించారు. ముఖ్యఅతిథి ప్రభుత్వ పూర్వ సలహాదారు డాక్టర్ కేవీ రమణాచారి మాట్లాడుతూ... సాహితీ కార్యక్రమాలు విరివిగా జరగాలన్నారు. ఈ కార్యక్రమంలో పాత్తూరి సుబ్బారావు, కలా జనార్దనామూర్తి, గుదిబండి వెంకటరెడ్డి, కేతవరపు రాజశ్రీ, పెద్దూరి వెంకటదాసు, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



పురస్కార గ్రహీతలతో ప్రభుత్వ పూర్వ సలహాదారు డాక్టర్ కేవీ రమణాచారి